# మారిన తరం!

రంగనాయకులు ఆఫీసు దగ్గర సైకిలు దిగి, అటూ యిటూ చూశాడో క్షణం. అలవాటు ప్రకారం యెవరూ సైకిలును అందుకోటానికి రాలేదు. వాన జల్లు పడ్తోందొకవైపు; ఉస్సురనుకొంటూ ఆయనే సైకిలును స్టేండు వైపు నడిపించాడు.

అయిదురోజుల క్రితందాకా రంగనాయకులు ఆ ఆఫీసుకు మకుటం లేని మహారాజు. పేరుకు హెడ్‌క్లర్కే అయినా ఎవరులో 'హెడ్ ఆఫ్ ది ఆఫీస్' అని చెప్పవచ్చు.

ఆయన కిష్టంలేకపోయినా, ప్రభుత్వం వారు ఆయన్ని రిటైరు చేశారు. వయస్సయితే యాభై అయిదు సంవత్సరాలు కాని, ఆయన చూడటానికి నలభై అయిదేళ్ళ వాడిలా వుంటాడు. పొట్టిగా, దృఢంగా వుండే ఆయన పంచె, లాల్చీ ధరించి కళ్ళజోడు క్రిందిభాగంలోనుంచి మనుష్యులను పరికిస్తూ ఆఫీసులో తిరుగుతుంటే, అందరికీ హడలుగానే వుండేది.

ఆఫీసును దేవాలయం అనుకొని, ఫైళ్ళనే దేవతలుగా భావించి పూజించేవాడు రంగనాయకులు. అశోకుని గురించో, వియత్నాం యుద్ధాన్ని గురించో అడిగితే ఆయనసరిగ్గాసమాధానం చెప్పలేకపోవచ్చు కాని, ఫలాని సంవత్సరంలో, ఫలాని విషయంమీద 'జీ. వో.' వచ్చివుండాలి-అని యెవరైనా అంటే, ఆ జీఓ. నెంబరు, తారీఖు, అందులోని పేరాలు, దాన్ని అప్రూవ్ చేసినవాడి పేరు, ఇత్యాది వివరాలతో సహా చెప్పగల సామర్థ్యం ఆయన కుంది. ఏ పుస్తకంలో ఏ రూలుందో ఆయనకి కంఠోపాఠం. ఏ రూలును ఎలా తిప్పితే మేలు జరుగుతుందో, ఎలాంటి భాష్యం చెప్పితే కీడు చేయవచ్చో ఇత్యాది మెళుకువలు ఆయనకు తెల్సు.

అందుకే యెందరు ఆఫీసర్లు మారినా ఆయన కా ఆఫీసులోగల ప్రతిపత్తిలో మార్పు రాలేదు. ఆఫీసరుకు వ్యక్తిగతంగా ఆయనంటే యిష్టం వున్నా లేకపోయినా ఆయన మాట కాదనలేదెవరూ – ఆయన్నడగందే ఏ పనీ చేయలేరు. ఆఫీసు విషయాల్లో ఆయన పాండిత్య ప్రతిభ అలాంటిది!

వర్షం పెద్దదయింది. దబదబమని రేకుల షెడ్డుపై చినుకులు పడ్తున్నాయి. రంగనాయకులు ఎలాగోలాగు యిరికించి తన సైకిలును షెడ్డులో పెట్టేడు.

సైకిలు షెడ్డుకు ఆఫీసు బిల్డింగుకు మధ్య దూరం యిరవై గజాలుంటుంది. వాన చినుకుల్లో అలాగే వెళ్తే కాస్తో కూస్తో తడవవచ్చు. వెళ్లాలా? ఆగాలా? ఆలోచన. ఆ ఆలోచనలోనుంచి మరో ఆలోచన....

రిటైరు కాకముందు, తనుగా సైకిలు నేనాడూ షెడ్డులో పెట్టి యెరుగడు. తను ఆఫీసు కొచ్చేసరికి, తనను, సైకిల్‌ను రిసీవ్ చేసుకోటానికి ప్యూనులు ఎదురు చూస్తుండేవారు. ఒకడు సైకిలు తీసుకొంటే, మరొకడు తన సంచీని తీసికొని, తనకి ఆఫీసులోకి మార్గం చూపిస్తున్నట్లు నడిచేవాడు ముందు. ఏ రోజైనా వర్షం వస్తే...ఎక్కడైనా గొడుగు సంపాదించి ఆ గొడుగు పడ్తూ తనని తీసికెళ్ళేవారు. ఆఫీసుదాకా తడిసి వచ్చినా, తన గదిలోకి గొడుగుకింద పోవాల్సిందే!

'ప్చ్...ఆ రోజులే వేరు–'

వెళ్ళటానికే నిశ్చయించుకొన్నాడు. సరిగ్గా అదే సమయానికి శాయిలు గొడుగు పట్టుకొని వరండాలోనుంచి వెళ్తున్నాడు. వో క్షణం ఆశ...మరో క్షణం నిరాశ...

'శాయిలూ...' వాడు వెనక్కి తిరిగి చూచాడు. 'వోనిముషం యిలా రారా–' అన్నాడు రంగనాయకులు.

'ఉండండి బాబూ...అయ్యగోరు పిలుస్తున్నారు తొందరగా–' అంటూనే వాడు వెళ్ళేడు.

రంగనాయకులికి మండిపోయింది. తల కొట్టేసినట్లయింది. తను – నోరు తెర్చి పిలిస్తే...వెధవ కంత నిర్లక్ష్యమా?... అదే అయిదురోజుల క్రితం అయితే-వెధవకు ఉద్యోగం పోయుండేది.

వానలో తడుస్తూనే ఆఫీసువరండాలో కెళ్ళేడు రంగనాయకులు.

గుమాస్తాలు ఫైళ్లు పట్టుకొని అటూ యిటూ తిరుగుతున్నారు హడావుడిగా. కొందరు కుర్చీల్లో కూర్చొనే సిగరెట్లు కాలుస్తూ ఫైళ్ల పఠనంలో మునిగి ఉన్నారు. కొత్తగా వచ్చినట్లుంది వో లేడీ టైపిస్టు-వారపత్రికలో సీరియల్ సీరియస్‌గా చదువుతోంది. ఆమె కెదురుగా వున్న టైపిస్టు ఆమెవైపే చూస్తూ టైపు చేస్తున్నాడు!

అందరూ రంగనాయకుల్ని చూచారు. అయితే యెవరూ తాము చేస్తున్న పను




కప్పగంతుల మల్లికార్జునరావు

లను మానలేదు. గౌరవంగా లేచి నిలబడలేదు. కనీసం 'విష్' అయినా చేయలేదెవరూ.

'ఇన్‌డిసిప్లిన్' అనుకొని పళ్ళు కొరుక్కొన్నాడు రంగనాయకులు. ఇదే అయిదురోజుల క్రితం అయితే? అందరికీ వో అరగంటకల్లా 'శుభలేఖ'లు పంపించేవాడు తాను.

'మూర్తిగారున్నారుట్రా?' అటు పోతున్న కొండయ్యను ఆపి అడిగాడు. కొండయ్య ఆ ఆఫీసులో వొక ప్యూను.


'ఏమోనయ్యా. వుండే వుంటారు. నేను సూళ్లేదు–' అంటూనే వాడు వెళ్ళిపోయాడు.



'పోయేవాడిని వెనక్కి లాగి చాచి చెంపకాయ కొట్టాలన్నంత కోపం వచ్చింది రంగనాయకులకు. 'ఇదే అయిదు రోజుల క్రితం అయితే-' అని అనుకోబోయి ఆగేడు.

నిజమే! అయిదురోజుల క్రితం అయితే తను వాడిని వెంటనే 'సస్పెండ్' చేసి ఉండేవాడిలా ప్రవర్తిస్తే. కాని అయిదు రోజుల క్రితం తనతో వాడిలా ప్రవర్తించేవాడా అన్నది ప్రశ్న? లేదు. రిటైరయిందాకా అంతా తన అడుగులకు మడుగులొత్తేరు. ఇవాళ చూస్తే ఆఫీసు వాతావరణమే మారిపోయింది. కారణం ఏమిటి?

కారణం ఇలా ఊహించాడాయన—. వచ్చిన హెడ్‌క్లర్కు మూర్తి తనంత సమర్థవంతుడు కాడు. వయసునా, అనుభవానా కూడా పిల్లవెధవే. తను కనుక-అలా...అలా అందరినీ గిరిలో పెట్టి ఆడించుకొంటూ, ఆఫీసును పకడ్బందీగా నడిపించాడు. అలా ఆ మూర్తేం చేయగలడు?




హెడ్‌క్లర్క్ గదిలో కాలు బెట్టేడు రంగనాయకులు.

ఎదురుగ్గా తన సీటు. అయిదురోజుల క్రితం తను కూర్చున్న ఆ కుర్చీలో ఇప్పుడు మూర్తి!

మూర్తికి ముప్పై అయిదేళ్ళుంటాయేమో. గ్రాడ్యుయేటు. యు.డి.సి గా డైరెక్టు సెలక్షనయి, యిరవై ఆరో యేట సర్వీసులో ప్రవేశించాడు.

స్వభావసిద్ధంగా మూర్తి చాలా మంచివాడు. నెమ్మదస్తుడు. పెద్దలంటే గౌరవం ఉంది. అయితే అతను కొన్ని ఆదర్శాలకు, అభిప్రాయాలకు కట్టుబడి ఉండే మనిషి. కొన్ని విషయాల్లో పాత పద్ధతులు నచ్చవు. అందులో ఆఫీసు పద్ధతి వొకటి.

అతని ఉద్దేశ్యంలో యీ ఆఫీసు పద్ధతి చాలా పాతది. ఏనాడో బ్రిటీషువాళ్ళు-భారతీయుల్ని నమ్మని రోజుల్లో యేర్పరచిన పద్ధతులు యీ కాలానికి అనుగుణంగా లేవని అతని విశ్వాసం.

సాధారణంగా మూర్తి వద్ద కాగితాలు 'పెండింగ్' అంటూ ఉండవు. 'రెడ్ టేప్' అంటే అతనికి చిరాకు.

మూర్తి ఏదో వ్రాసుకొంటున్నాడు. రంగనాయకుల్ని చూచినట్లే వుంది-అయినా చూడనట్లే తన పనిని తాను చేసుకొంటున్నాడు. విష్ చేయలేదు. కనీసం కూర్చోమనలేదు.

రంగనాయకులకు తల కొట్టేసినట్లయింది!

మూర్తి అతని కింద యేడేళ్ళు పని చేశాడు. ఆఫీసుకు రాగానే అతని డ్యూటీ రంగనాయకులుకు విష్ చేయటమే! ఐతే తరచు రంగనాయకులి పాత భావాలకు, పద్ధతులకు, మూర్తి భావాలకు నమ్మకాలకు, సంఘర్షణలొస్తుండేవి, రంగనాయకులదే చివరి విజయం. అంతా ఆయన వాదననే సమర్థించి మూర్తిని సర్దేవారు.

ఏడేళ్ళ క్రితం-మూర్తి మొదటిసారిగా యీ ఆఫీసుకు ట్రాన్స్‌ఫర్ అయి జాయిన్ కావటానికి వచ్చినరోజు...

అకస్మాత్తుగా ఆ రోజు జ్ఞాపకంవచ్చింది రంగనాయకులకు-

ఆరోజు...

తను-ఇప్పుడు మూర్తిలాగే పని చేసుకొంటున్నాడు. మూర్తి రాకను గమనించాడు. అయినా తల యెత్తి చూడలేదు.

'నమస్కారం సార్!' అన్నాడు మూర్తి. తను మాట్లాడలేదు.

ఒక్కనిముషం గడిచింది. వ్రాసుకొచ్చిన కాగితాన్ని బల్లమీద తన ముందుంచి, మాట్లాడకుండా బయటి కెళ్ళేడు.

'ఎంత పొగరు?'

అయిదు నిముషాలాగి అతన్ని పిలిపించాడు.

'కాగితం నా ముఖానకొట్టి వెళ్ళటంలో నీ వుద్దేశ్య మేమిటి?' అధికారయుతంగా ప్రశ్నించాడు తాను.

'జాయినింగు రిపోర్టు యివ్వటం నా ధర్మం. కనుక యిచ్చాను-' సమాధానం.

"నా చేతి కిచ్చి ఫలానా అని చెప్పటం నీ ధర్మంకాదా? అందులోనూ కొత్తగా చేరుతున్నావ్-యీ ఆఫీసులో-'

'మీ రేదో పనిలోవున్నారు. నమస్కరించినా తల వూపటానికి వీల్లేనంత పనిలో వున్నారు. మిమ్మల్ని 'డిస్టర్బు' చేయటం మంచిది కాదనుకొన్నాను-'

"ఓహో - అలా అనుకొన్నవాడివి పనయిందాకా ఎందుకు వుండలేదు? అది నీ విధి కాదనుకొన్నావా?"

"అవును. నిలబడటం నా విధీ కాదు- నిలబెట్టటం మీ ధర్మమూ కాదు- అనుకొన్నాను."

కొట్టినట్లయింది తనకు? కానీ ఏం చేయగల డిప్పుడు? సమయం రాకపోతుందా - అనుకొని పంపించేశాడు. ఆ తర్వాత కావాలనే అతన్ని తన క్రింద వేసుకొన్నాడు. అదే మొదలు యిద్దరి మధ్యా స్పర్ధలకు-

ఆనాడు-నిలబెట్టటం తన ధర్మం కాదన్నాడు. మరిప్పుడు తను చేస్తున్నదేమిటో? పెద్దవాడన్న మర్యాదన్నా లేకుండా...

కొంపతీసి ప్రతీకారంగా, అత నీ పని చేయటం లేదుకదా?

ఆలోచించగా, ఆలోచించగా యీ ఆలోచన ఆయనకు వచ్చింది. సందేహం లేదు. ఇది ప్రతీకారమే. రంగనాయకులకు కోపం వచ్చి వెంటనే తగ్గింది. ఆఫీసుల్లో పనులు కావాలంటే కోపతాపాలు పనికిరావని ఆయనకు తెల్సు!

'నమస్కారం మూర్తిగారూ...'

'నమస్కారం - కూర్చోండి -' తల ఎత్తకుండానే అనేసి తన పని తాను చేసుకొంటున్నాడు మూర్తి.

రంగనాయకులు కుర్చీలో కూర్చున్నాడు. కూర్చున్నాడన్న మాటేగాని-మహా సామ్రాజ్యాన్నేలిన రాజు, శత్రురాజు సౌధంలో ఆతిథ్యం పొందుతున్నప్పటిలా వుంది అతని స్థితి!

ఎంతకీ మూర్తి వ్రాత పూర్తికాదు. అదేం వ్రాతో మరి?

'నా పెన్షన్ కాగితాలు...'అంటూ ఆగేడు రంగనాయకులు, మిగతా విషయం మూర్తే చెప్తాడన్న ఆశతో.

మూర్తి వ్రాయటం పూర్తి చేశాడు. ఫైలు 'ట్రే'లో పడేసి లేచాడు. 'వన్ మినిట్' అంటూ బయటికి వెళ్ళిపోయాడు.

రంగనాయకులకు మతిపోయినట్లయింది! తను-ముప్పైరెండేళ్ళ సర్వీసు చేసి రిటైరయిన తను - ఎదురుగ్గా కూర్చుంటే 'వన్ మినిట్టా? ఎంత యిన్సల్ట్'? ఆఫ్టరాల్ అతని సర్వీసు, తను వాడిన శెలవులంత లేదు?'

అనుకొంటుంటే గత సంఘటన వొకటి గుర్తుకొచ్చింది అతనికి -

ఒక రోజు-

మూర్తి శెలవుపెట్టేడు. కాగితం తన వద్ద వుంది. తను రికమెండ్ చేస్తేనేకాని అది శాంక్షన్ కాదు. మరుసటిరోజే అతను వూరి కెళ్ళాలంటున్నాడు.

తను యిలాగే వ్రాసుకొంటున్నాడు.

మూర్తి గదిలోకి వచ్చి నిల్చున్నాడు. తను తల ఎత్తలేదు. ఎప్పుడూ లేనిది-తన అవసరం అనేమో, పది నిముషాలు నిల్చున్నాడు. ఉహు ... తను తల ఎత్తలేదు.

'సార్...నా శెలవు విషయం...'

అప్పుడే తను వ్రాయటం ముగించాడు. ఫైలు అవతలపడేసి లేచాడు. 'చూద్దాం' అంటూ కాఫీకి వెళ్ళేడు.

రంగనాయకులకు కడుపులో దేవినట్లయింది ఈ సంఘటన గుర్తుకు రాగానే సందేహం లేదు...ప్రతీకారం...మూర్తి తనపై ప్రతీకారం తీసుకొంటున్నాడు.

నిమిషాలు గడుస్తున్నాయి. క్రమంగా అవి గంటల్లోకిమారుతున్నాయి. అయినా మూర్తి జాడలేదు.

ఇన్నేళ్లు ఆ ఆఫీసు సామ్రాజ్యాన్నేలి, యివాళ 'నా కాగితాన్నేం చేశావ్?' అంటూ గుమాస్తా దగ్గిరి కెళ్ళటం నామోషీ. అసలు తన సర్వీసులో ఎన్నడూ గుమాస్తాబల్లవద్ద కెళ్ళి నిల్చోని ఎరుగడు.

ప్యూనుచేత పెన్షన్‌కు సంబంధించిన గుమాస్తాకు కబురుపంపేడు. ఏ 'మూడ్' లో వున్నాడో - సరే నంటూ వెళ్ళేడు ప్యూను. తిరిగి వచ్చి గుమాస్తా సీటులో లేడని చెప్పాడు.

రంగనాయకులు గడియారం చూచుకొన్నాడు. సరిగ్గా ఒకటిం బావు-లంచ్ టైము...

'వచ్చాక పిల్చుకొస్తాన్లే అయ్యా-' అన్నాడు ప్యూను. అని వెళ్ళలేదు నిలబడే వున్నాడు. అంటే వాడేదో అడుగనున్నాడన్నమాట!

ఆ క్షణంలో రంగనాయకులు అయిదు రోజుల క్రితంనాటి హెడ్ క్లర్కు అయ్యాడు. గంభీరంగా పేపరు చూడ సాగేడు.

'అయ్యా-'

అవును, సందేహంలేదు. తన్తో ఏదో పనుంది వాడికి. ఏ రూల్సు సంగతో అడుగుతాడు తనని. కాకపోతేఅప్లికేషన్ ఎలా వ్రాస్తే బాగుంటుందని సలహా అడుగవచ్చు. అంటే తనకింకా ఆఫీసులో గౌరవం వుంది. రిటైరయినా రూల్సు దగ్గిరి కొచ్చేసరికి తన దగ్గిరకురావల్సిందే ఎవరైనా.

ఆయన అయిదురోజుల క్రితం మౌన ముద్ర వహించాడు.

'కాఫీ తాగుతానయ్యా-'

చెళ్ళున చంపనకొట్టినట్లయింది. తలెత్తి ప్యూనువైపు చూచాడు. వాడు నవ్వుతూ మళ్ళీ అన్నాడు- "మీ పని అవుతుందయ్యా. గుమాస్తాగోరు రాగానే నేను సెప్పి సేయిత్తాను. ఓ అద్ద రూపాయి డబ్బు లిప్పిత్తె...!

లంచం! కాదు ... పొరపాటు... మామూలు!

ప్యూనులు ఆఫీసు కొచ్చిన వాళ్ళని అలా అడగటం మామూలేనని రంగ నాయకులుకు తెలీనిదేంకాదు. అయితే చూచి చూడనట్టూరుకొంటా రంతా - పోనియ్‌లే - అన్నట్టు!

అలాగని-తన్నుకూడా మామూలడు గుతాడా? ... డిస్మిస్ చేద్దామన్నంత కోపం వచ్చింది.


'తర్వాత చూద్దాంలే కానియ్ —' అన్న తర్వాత ఆశ్చర్యపోయాడు రంగ నాయకులు.

'చూద్దాం'అన్నారంటే చేతులోపడ్డట్లే లెక్క. ప్యూను హుషారుగా వెళ్లేడు.

పది నిముషాల తర్వాత పెన్‌షన్ గుమాస్తా వచ్చాడు. వస్తూనే 'బాగు న్నారా?' అన్నాడు-అదో విధంగా.

రంగనాయకులకు రాకెట్టు ఎక్కినట్ల యింది. ఆఫీసులో అడుగుపెట్టిన లగా యతు ఆమాత్రం క్షేమ సమాచారం అడిగినవారేరి?

'బాగున్నానోయ్. ఊ......నువ్వు



బాగున్నావా? పిల్లలూ అదీ బాగు న్నారా?'

రంగనాయకుల సర్వీసు మొత్తంలో ఆమాత్రం కుశలప్రశ్నలు ఏ గుమాస్తానూ అడగలేదు. ఆ గుమాస్తా ముసి ముసి నవ్వులు నవ్వేడు.

కాస్సేపాగి మళ్ళీ రంగనాయకులే అన్నాడు - 'ఆ...ఏమిటోయ్ యింకా సంగతులు? ... ఏంలేదూ ... వొకసారి మిమ్మల్నందర్నీ చూచి పోదామని వచ్చా—'

పెన్‌షన్ గుమాస్తా మాట్లాడలేదు. అతనికి తెల్సు యిదంతా దేనికో!

'అన్నట్లు నా పెన్‌షన్ కాగితా

లేమయినా యోయ్. శాంక్షనయిందా?... ఆఁహా–నాకు తెల్సు నీ దగ్గర పెండింగ్ అట్టేపెట్టుకోవని. అసలే స్టేజీలో వుందో నని—'

'సారీ సార్. మీకు తెలీని దేముంది? అఫిషియల్ 'సీక్రసీ'–హెడ్ క్లర్కుగారి నడగండి—'

కాళ్ళ కింద భూమి తిరుగుతున్నట్లు–భూమిలోకి తను కూరుకుపోతున్నట్లు అనిపించింది రంగనాయకులకు.

అయిదురోజుల క్రితం యీ అఫీసులో తనకు తెలీని విషయం కానీ–తనకి చెప్ప కూడని విషయం కానీ అంటూ లేదు. తనకు సంబంధించిన 'సబ్జక్ట్' కాక పోయినా, కబురుపెడ్తే తన దగ్గరికి ఫైలు తీసుకొచ్చి చెప్పి వెళ్ళవల్సిందే—

అయితే యివాళ? అన్నీ రహస్యాలే. హెడ్‌క్లర్కు నడగాలిట!

జ్ఞాపకం వస్తోంది ... అవును ... తను యీ పెన్‌షన్ గుమాస్తాతోనే అన్నాడు ఓమాటు—

ఆ రోజు...

ఆతను ఎవరికో యిన్‌ఫర్మేషన్ చెప్పటం తన కళ్ళపడింది. తర్వాత పిలిపించి అడిగితే–'ఆఫీసరుగారు చెప్ప మన్నారని వ్యూను చెప్పేడుసార్' అన్నా డతను. తనకి కోపం వచ్చింది.

'మిస్టర్. అఫిషియల్ 'సీక్రసీ' కాపాడడంగుమాస్తావిధి. అడ్డమైన వాడికీ ఫైళ్ళు ముందు పెట్టే దానికి మన మెందుకు? ఆఫీసర్ చెప్పినా సరే–గుమాస్తాకు ఆఫీసు విషయాలను యితరులకు చెప్పే అధికారంలేదు. మొదటిసారి కనుక వూరుకొంటున్నా; యింకోసారి ఎవరన్నా అలావస్తే నా దగ్గరకు పంపించు–' అన్నాడు యింగ్లీషులో తను.

తన మాటలు తనకే వప్పచెప్తున్నట్లుందివాళ!

తనకి తెల్సు యిలా జరుగుతుందని. అందుకే అప్పటికీ, అన్నీ చక్క చేసుకొన్నాడు రిటైరు కాబోయే ముందే. శెలవులు శాంక్షన్ చేసుకొన్నాడు. ఇంక్రిమెంట్లన్నీ తీసికొన్నాడు. సర్వీస్ రిజిష్టర్ 'అప్ టు డేట్' చేయించుకొన్నాడు. పెన్‌షన్ అప్లికేషన్ పెట్టి, దానిమీద నోటు వ్రాయించి ఆఫీసరుకు పంపించాడుకూడా.

ఆయన సంతకం అయినట్లయితే తనకీ ఆఫీసులో పనే ఉండకపోవును. కానీ ఆఫీసరు సందేహిస్తూ ఆలస్యం చేశాడు.

అప్పటికీ రిటైరయే రోజుకి అడగనే అడిగాడు–సంతకం పెట్టెయ్యండని–

'రిటైరుకాండీ ముందు – సంతకానికేముంది? ఎప్పుడైనా చేయవచ్చు–'అన్నాడాయన నవ్వుతూనే. తనేమనగలడు? త్వరగా చేయండి–అని మాత్రం చెప్పేడు.

నాలుగురోజు లయినా ఆర్డర్స్ రాలేదు ఇవాళ వస్తే ఇదీ వరస–!

అయినా ఆఫీసరు సంతకమై, ఆర్డర్స్ రావటాని కింత ఆలస్యమా?

అయిదురోజుల క్రితం ఆఫీసరువద్దనున్న ఫైలు–ఇంకా అక్కడే ఉందో, 'అప్రూవ్' అయి గుమాస్తావద్ద కెళ్ళిందో 'క్వెరీ' పడి హెడ్‌క్లర్కువద్ద ఉందో...!! ఆత్రుత–అయోమయం ...ఆందోళన–!

మూర్తి ఇంకా రాలేదు.

రంగనాయకులు ఆఫీసరువద్దకే వెళ్ళటానికి నిశ్చయించుకొన్నాడు.

హెడ్‌క్లర్కు గదినుంచి ఆఫీసరు గదిలో కెళ్ళాలంటే కొన్ని 'సెక్షన్'ల గుండా వెళ్ళాలి. అయిదురోజుల క్రితం ఆయన అటు వెళ్ళినా ఇటు వచ్చినా, ఆ సెక్షన్లలో వాళ్ళంతా లేచి నిలబడాల్సిందే!

ఇవాళ ఆయనటు వెళ్తుంటే, ఎవరూ ఆయనవైపే చూడలేదు. కాగా ఒకరిద్దరు సిగరెట్లు తాగుతున్నవారు, యీాయన్ని చూచి 'విష్' చేసినట్లు సిగరెట్టు వున్న చేతిని వూపేరు.

'లాభంలేదు. ఆఫీస్‌లో 'డిసిప్లిన్' అంతమయింది. పరిస్థితుల్ని ఆఫీసరు దృష్టికి తీసుకెళ్ళి విశదీకరించి చెప్పకపోతే లాభం లేదు–' అనుకొన్నా డాయన.

సరిగ్గా యిదే సమయంలో మూర్తి వచ్చేడు–ఆ శెక్షన్‌లోకి. ఒక రిద్దరు బాగా పాత గుమాస్తాలు అలవాటు ప్రకారం లేవబోయారు. మూర్తే వారించాడు–'ఆ కాలం పోయిందంటూ–'

ఉలిక్కిపడ్డాడు రంగనాయకులు! "కాలంపోయిందా? ఎలా పోతుంది? పైవాడు వస్తే కిందివాడు లేచినిలబడకపోతే యింక 'డిసిప్లిన్' ఏం ఏడుస్తుంది?" అనుకొన్నాడు.

రంగనాయకులు ఆఫీసరు గదిలోకి కాలు పెట్టేసరికి, ఆయ నేదో ఫైలును గురించి వొక గుమాస్తాతో మాట్లాడుతున్నాడు.

'నమస్కారంసార్' అన్నాడు రంగనాయకులు–వెళ్తూనే చాలాసాధారణంగా అలవాటు ప్రకారం.

ఆఫీసరు ఆయనవైపు చూచాడు–'బయట 'వెయిట్' చేయండి. వసైపోగానే పిలిపిస్తాను' అని అనేసి తిరిగి గుమాస్తాతో మాట్లాడుతున్నాడు.

రంగనాయకుల కీ తడవ ఏడుపు వచ్చింది!

అయిదురోజుల క్రితం ఆఫీసరు దగ్గరి కెళ్ళటానికి తనకి పిలుపు లక్కర్లేదు. వెయిటింగ్ అసలేలేదు. ఎప్పుడు అనుకొంటే అప్పుడే వెళ్ళటం. తను వెళ్ళగానే ఆయన కుర్చీ చూపించి 'కూర్చోండి రంగనాయకులుగారూ' అనాల్సిందే–ఎంత పనిలోవున్నా, ఎందరితో మాట్లాడుతున్నా, ఆ ఆఫీసులో ఆఫీసరు ఎదుట కూర్చునే గౌరవం తన కొక్కడిదే!

తనకి తెలీకుండానే రంగనాయకులు బయటికొచ్చి నిల్చున్నాడు.

గుమాస్తాలు ఎవరి పనులు వారు చేసుకొంటున్నారు. ఎవరూ ఆయన వునికినే గుర్తించినట్లే లేదు.

చూడగా చూడగా అంతా తనపై కక్ష కట్టినట్లు తోచిందాయనకు.

అంత మానసిక బాధలోనూ, తనపట్ల ఆఫీసులో వాళ్లు చూపుతున్న యీవుదాసీనతకు ఆశ్చర్యంకూడా వేసింది! ఆ తర్వాత ఆయనకో అనుమానం కలిగింది!

ముప్పైరెండేళ్ళ తన సర్వీసులో-అందులోని యిరవై ఏళ్ళ హెడ్ గుమాస్తా సర్వీసులోతనను అంతా గౌరవించారు. తనంటే అందరికీ హడలే!... వారు భయపడింది నిజంగా తనను చూచేనా? గౌరవించింది తన వ్యక్తిత్వాన్నేనా?

కాదని మొట్ట మొదటిసారిగా అయనకివాళ అనిపించింది.

వాళ్లు భయపడింది-తన అధికారాన్ని చూచి! గౌరవించిందీ ఆ అధికారాన్నే!

'తను' అనేవాడు అందులో నిమిత్తమాత్రుడు. కాకపోతే-యివాళ తనిలా అవమానాలు భరిస్తూ. బిక్కచచ్చి, భయం భయంగా యిక్కడ నిల్చోవాల్సి వచ్చేదికాదు.

ఆఫీసరుగారినుంచి కబురు. వెళ్ళేడు-అప్రయత్నంగానే!

'యేస్ ... చెప్పండి. నేనేం చేయగలను మీకు?' యింగ్లీషులో అన్నాడాయన.

ఎవరో పరాయివాడు వస్తే. వాడిని త్వరగా వదుల్చుకోవా లనుకొన్నప్పుడు ఆ మాటలు, ఆ పద్ధతిలో అంటాడు. తనిప్పుడు పరాయివాడు-తను తొందరగా వెళ్ళిపోవాలి...

'ఏం లేదండి. పూరికే చూచి పోదామనీ-' అందామనుకొంటున్నాడు.

'కమాన్. నా కాలం వృథా చేయక త్వరగా చెప్పండీ–'

'నా పెన్షన్ విషయం...' అనుకోకుండానే అనేసి అంతలోనే ఆగేడు.

అఫీసర్ బెల్లు కొట్టేడు-

ఏదో ఆశ!... మూర్తిని పిలిపిస్తాడు. ఏమింత ఆలస్యమయిందేమని కోప్పడుతాడు! తనప్పుడు ఆఫీసు పరిస్థితి చెప్తాడు.

'వీరిని మూర్తిగారి వద్దకి తీసికెళ్ళు. నేను పంపించానని చెప్పు-' వచ్చిన ప్యూనుతో అనేసి పనయి పోయినట్లు ఫైలు చూచుకోసాగేడు ఆఫీసరు.

రంగనాయకులకి, కోపం, దుఃఖం, కక్ష, నిరాశ. నిస్పృహ...అన్నీ కల్సి వచ్చాయి.

తన్నో పరాయివాడికింద చూచాడు ఆఫీసరుకూడా. అయిదురోజుల క్రితం దాకా, ఎవరైనా వస్తే తనదగ్గరి కిలాగే పంపించేవాడు. ఆ వచ్చిన వాళ్ళకి తనెంతమాత్రం పనిచేసేవాడు? తనకూ యిప్పుడంతే—!

తలవంచుకొని చకచకా నడిచాడు సైకిలుస్టేండువైపు-

"సార్ -" మూర్తిదే ఆ పిలుపు. అయినా ఆగలేదు.

"ఒక్క నిముషం సార్ -" మూర్తే వచ్చాడు. రంగనాయకులు ఆగి అతనివైపు చూచాడు. మనసు వ్యతిరేకిస్తున్నా. కాళ్ళు అతని వెంట గదిలోకే నడిచాయి.

మూర్తి యిప్పుడు చూపిస్తున్న గౌరవం, ఆదరణా, అప్యాయతా చూచేసరికి విస్తుపోయాడు రంగనాయకులు!

స్వయంగా, కుర్చీలో దుమ్మ్ముదులిపి కూర్చోబెట్టేడు. కాఫీ తెప్పించాడు. కుశల ప్రశ్న లడిగాడు. అన్నీ అయ్యాక చేతికో కాగితాన్నిచ్చాడు.

ఆశ్చర్యం! అది తనకు పెన్షన్ శాంక్షన్ చేసిన కాగితం! నోటమాట రాక మూర్తివైపు చూచాడురంగనాయకులు.

"కాలం మారుతోంది సార్, జాప్యాలు...కావాలని పదిసార్లు చుట్టూ తిప్పించుకోటం, అధికారదర్పం, గర్వం, కిందివాడిపట్ల 'బాసిజమ్', నిర్లక్ష్యం అంతమయ్యే కాలమొస్తోంది-"

ఏమో ననుకొన్నాను కాని, నిజంగా ఎంతమంచివాడు మూర్తి?-

నిజమే తన రోజులలోలాగా కాదిప్పుడు. వ్యక్తి గౌరవం, స్వాతంత్ర్యం యిచ్చి పని చేయించుకోవాలి. దబాయింపులు, దాష్టీకాలు సహించరు కుర్రకారు. నిజానికిదే మంచిదేమో.

"పొద్దుననుంచీ మీ రనుభవించిందీ, ఆలోచించిందీ, మీ తరంనాటి పద్ధతి. ఇప్పటి మీ ఆలోచనలు యీ తరానివి. రెంటి మధ్య వ్యత్యాసం, దూరం, మీ రీపాటికి తెల్సుకొనే వుంటారు. మీ తరంనాటి మీ పద్ధతికి యితరులెంత బాధపడ్డార నేది మీరు తెల్సుకోటానికే, మిమ్మల్నివాళ మేం బాధపెట్టాల్సి వచ్చింది. అందుకు మమ్మల్నందర్నీ క్షమించండి-"

త ననుకొన్నట్లు కావాలనే నన్న మాట-యింత చేసింది? అయితే త ననుకొన్నట్లు-తనపై పగతో కాదు; తనకు గుణపాఠం నేర్పటానికి!

గడియారం అయిదు గంటలు కొట్టింది. గుమాస్తాలంతా వాకిట్లోకి వచ్చారు.

"ఐయిదు కొట్టీకొట్టగానే బయల్దేరేరే!" అలవాటుగా అనుకోబోయి ఆగేడు రంగనాయకులు.

"అయిదు రోజుల్లో యీ ఆఫీసులో ఎంత మార్పు?!" అని మాత్రం అనుకొన్నాడు.

"ఒక్క నిముషంఆగండోయ్ - నారాయణా - రంగనాయకులుగారుకూడా వస్తారు. అంతా కల్సే వెళ్దాం-"అన్నాడు మూర్తి గుమాస్తాల నుద్దేశించి.

తన తరానికీ, యీ తరానికీ, అలోచనల్లో, అలవాట్లల్లో గల వ్యత్యాసం రంగనాయకులకు యిప్పుడు బాగా అర్థమయింది!